# విరుగుడు

రచన:
కె. బి. వి. కోటేశ్వర్.

వంటింట్లో ఎవరేమి పాడుపనిచేశారో ఏమోగాని, తెల్లారిందో లేదో రంగమత్త ఊరికే రుసరుస లాడుతూ విసుక్కుంటోంది. స్నానంచేసి బట్టలు తొడుక్కుని తల దువ్వుకుంటూంటే రవణ కాఫీగ్లాసుతో గదిలో ప్రవేశించి ముభావంగా, ఈజీచైరు ప్రక్కనున్న బల్లమీద పెట్టేసి వెళ్లిపోయింది మాట్లాడకుండా. భార్యరావటం ఓకంట కనిపెడుతూన్న చిరంజీవి రావుకి భార్యముఖంలోని కోపానికి కారణం తెలియలేదు.

ఆలోచిస్తూనే అతడు కుర్చీలోకూలబడి బూట్సు తొడుగుకుంటూ. ఏదో హిందీట్యూన్ తనలో తను నెమ్మదిగా పాడుకొంటూ; ఆతరువాత కాఫీ తాగడం ప్రారంభించాడు. పాడుకొంటూన్న వాడల్లా ఒక్కసారి పాట చటుక్కున ఆపేసి, చురుక్కున అంటుకొన్న పెదవులదగ్గర వేడికాఫీ మెల్లగా బల్లమీద పెట్టేసి, చెవులు రిక్కించి వింటానికి ఉపక్రమించాడు. భార్య ప్రతీరోజూ తన మామూలు ఉపన్యాసం తనకు కాఫీ అందివ్వడం తరవాయిగా ప్రారంభించేది. కాని యీవేళ ఆవిడ తల్లితో వొంటింట్లో, ఏదో గుసగుస లాడుతూనట్లు చిరంజీవి రావు పసికట్టాడు. సంగనాచిలా రవణగదిలో ప్రవేశించి "ఆ వెధవపాటలకింక విధీవిరామం లేదేమిటీ?- తెల్లవారిందో లేదో మొదలు పెట్టారు కూనిధీర్గం. అబ్బ! తలతిరుగుతోంది. అవతల చంటిపిల్లకి పాలడబ్బా అయిపోయి తగులడింది పంచదార డబ్బాలో పిడికెడు పంచదారలేదు. బెల్లం కాఫీలు ఎక్కవు. ఎల్లుండి మామగారి తద్దినం. ఏమి సామానుకొనుకొన్నారో ఏమో — శేషూ మంచి గొన్లు కుట్టిస్తేగాని రేపణ్ణించి బడికెళ్లదుట. మరి పదిరోజుల్లో పెళ్లిప్రయాణం పెట్టుకొన్నామా — నా మొహానికి ఇంతవరకూ ఏమీ తెచ్చి పడెయ్యలేదుకదా — అసలు ఇప్పుడేమని నే మొత్తుకుంటే ఏమిలాభం. ఆనాడు డబ్బు ఇవ్వనుగాక ఇవ్వనంటే, నాకీరాత ఎందుకొస్తుందీ?" — ఉపన్యాసం ఏ కరువుపెడుతూన్న రవణస్వరం క్రమంగా ఏడుపులోకి ఎక్కిళ్లలోకి దిగింది.

అప్పుడు చిరంజీవి రావు క్రిందపెట్టేసిన కాఫీ మళ్లీ అందుకొని. త్రాగుతూ రవణకేసితిరిగి, "అన్నీ తొందరలోనే తెస్తాను. నన్ను వేదించుకొని తినకూ, చేతిలో కానీకూడా లేదు. ప్రస్తుతం. పోనీ నేనేదో నాకు కావలసిన ఖర్చులన్నీ చేస్తూ, నువ్వు నోరు జారదుతే, వీల్లేందంటే నామీద కోపగించటానికి అర్థంవుంది. మొన్న ఆఫీసులో బంట్రోతు శీతయ్య మొదలుకొని, సెక్రట్రీవరకూ అన్నవరంవెడితే నేను పదిరూపాయలుంటే పిల్ల పాలఖర్చు పెడుతుందని మానేశానే. సిగరెట్లు కాల్చడం చచ్చి చెడి మాన్పుకొన్నానుకదా, సినిమాచూచి ఆరు మాసాలకుపైగా అయిందా — నేను యింటి యజమాన్నయినా పొదుపుగా వుంటుంటాన్నే, నువ్వు నాకేదో కొనమంటే ఎలా చెప్పు. పోనీ నెలకు వచ్చిన 75 రాళ్లకు బదులూ సాలికి వెయ్యి రూపాయలయినా భూమిమీద వచ్చేవాళ్లమయితే నువ్వు అడిగితే లేదంటానా. నాన్నగారి జబ్బులో నువ్వు, పెళ్లికి వచ్చిన రెండువందలు యిచ్చావు గనుకనే, ఆయన మంచంమీద పడీ కూడా నెలరోజులు బ్రతికారు — పదిరోజుల్లో మా కంపెనీకి లాభం బాగా వచ్చిందని, మాకందరకూ బోనస్ ఇస్తారుట. దైవంరక్షించి అది వస్తేనా అంతానీకే. కంటతడి ఎందుకూ ఇలాకూర్చో" అని వంటింటి గుమ్మంవైపు తిరిగి "అత్తయ్యా కాస్త పంచదార తీసుకొనిరండి" అని పిలిచాడు గొంతుకు పెద్దదిచేసి.

రవణ ఏదో చెబుతామని గొంతుకు సవరించుకోవడం చిరంజీవి రావు గమనించాడు. మాటమాత్రం పెగలకపోవడం వల్ల. రవణ మాట్లాడలేక పోయింది. రంగమ్మగారు పంచదార డబ్బా, చెంచా, తెచ్చి అల్లుడిముందు పెట్టి, మొగుడు పెళ్లాలు ఏదో మాట్లాడుకొంటూంటే వుండడం తన స్వభావం కాదన్నట్లు అక్కడినుంచి వెళ్లిపోయింది. పంచదార తీసివెయ్యడానికి రవణ మెల్లగా దగ్గరకురాగానే. "నువ్వు ఆలా

కుర్చీలో కూర్చో, నే వేసుకోగలనులే'' అని కుర్చీ చూపించాడు చిరంజీవి రావు.

రవణ క్రిందిపెదవి మీదికి ఎత్తలేకపోయింది. ఆమెకు ఎందుకో తీవ్రంగా భయంవేసింది. మూతవేసిన డబ్బాలో, సగానికి పైగా పంచదార వుండడం చూసి, ఓ చెంచాడు పంచదార కాఫీలో వేసుకొని ఒక్క సారి కలుపుకొని పెదవులకు గ్లాసు అందిస్తూ చిరంజీవి రావు విజయసూచకంగా, ప్రశ్నార్థకంగా వేళాకోళంగా నవ్వాడు. రవణకూడా నవ్వింది. "ఇప్పటినుంచీ చెబితే గాని వారం రోజులకయినా పంచదార బయటనుంచి వూడి పడుతుందా?'' అంది కొంటెగా క్రీగంటచూస్తూ రవణ. "అమ్మగారికి అలుక తీరినట్లుందే'' అన్నాడు చిరంజీవి రావు నవ్వుతూ. అవునన్నట్లు తలపంకించి చిరునవ్వు నవ్వి వంటింటిలోకి తుర్రుమంది రవణ.

అదృష్టవశాత్తు రవణకు, ఆ మరునాడు పుట్టినరోజు పండుగనగా, చిరంజీవి రావుకి, అనుకొన్నట్లే వొంద రూపాయిలు బోనస్ వచ్చింది. చిరంజీవి రావు వొంద రూపాయిలు చేతిలోకి రాగానే, బాషలో వ్యక్తీకరించ టానికి వీల్లేనంత ఆనందాన్ని పొందాడు. రవణ ఏమి కోరడం అన్న విషయంగురించి అరగంట పార్కులో పచ్చగడ్డిమీద కూర్చుని ఆలోచించినా తేల్లేదు. గోల్డు మార్కెట్టుకు వెడితే అక్కడే ఏదో వొకటి కొన వచ్చు అనే నిర్ణయానికివచ్చి. చీకటి పడుతూంటే, లక్ష్మీజ్యుయల్రీమార్టు చేరాడు. కాసు అరవైరూపాయ అమ్ముతూన్న ఈ రోజుల్లో ఒక పచ్చ కాగితానికి ఏమి వస్తాయి. నెక్లెస్‌లు నూటఏభై రూపాలపై మాటగాని. తక్కువలేవు. జత బంగారుగాజులు చిరంజీవి రావు దృష్టి నాకర్షించాయి. వాటినికొని, రవణకు తను వెళ్ల గానే గాజులు చూపిస్తే క్షణంసేపు పట్టరాని సంతో షంతో మాటలాడలేక పోతుందని, పైకి అనక పోయినా, మనసులోనైనా తన భర్తంత మంచిమనిషి మరుండరని పొంగిపోతుందని ఊహాగానం చేస్తూ ఇల్లు చేరుకొన్నాడు. "రవణా, రవణా'' హడా విడిగా ఇంటిలో ప్రవేశించాడు చిరంజీవి రావు. రవణ ప్రక్కింటి హరమ్మగారితో మాట్లాడుతోంది. భర్త పిలుపు వినగానే సావిటిలోకి పరిగెత్తుకొచ్చింది రవణ.

"రేపు పుట్టినరోజు పండక్కు ఇదిగో బహుమానం. నీ అదృష్టం ఇవేళ వొంద బోనస్ ఇచ్చారు. ఇదిగో బిల్లు 96 రూపాయిలు, మిగిలినవి నాలుగు. భోజనం చేసాకా వాటితో సినిమా ప్రోగ్రాం. మనం సినిమా కెళ్లి చాలాకాలం అయింది కదూ'' గాజులపేకెట్ రవణ చేతుల్లోపెట్టి గదిలోకెళ్లాడు బట్టలు మార్చు కోవడానికి. "ఇలా తీసుకొనిరావే'' తల్లి పిలుపు విన్న గానే రవణ బహుమానం గురించి, సంతోషంగాని, అయిష్టతగాని వెలిబుచ్చకుండానే వెళ్లిపోయింది. రవణ అలా మాట్లాడకుండా వెళ్లిపోవడం నచ్చలేదు చిరంజీవి రావుకి. మనస్సులో చాలా బాధపడ్డాడు. మానసి కంగా, తనమీద భార్యకు తనమీద అసహ్యాభావం, ద్వేషం ఏర్పడ్డాయనే, అతను స్థిరపరచుకొన్నాడు. పుట్టినరోజు పండగని తను ఆప్యాయంగా తీసుకొచ్చిన గాజులు సరీగా చూడకుండానే, తల్లి పిలవగానే, రవణ వెళ్లిపోవడంలోనేవున్న ఆంతర్యం, అతనికి సుస్పష్టంగా అర్థంగాక, రవణకు తనమీదకంటె, తల్లి మీదనే అంతులేని అభిమానం, ప్రేమా అనే పునాది లేని తీర్మానానికి వచ్చేసాడు అతను.

కలకల లాడుతూండవలసిన ఆ సమయంలో రవణ ముఖం ముడుచుకుని, గదిలోకివచ్చి కోపంగా కను బొమ్మలు చిట్లిస్తూ. భర్త మొహంలోకైనా చూడ కుండా, ఆయన ఏమి బాధ పడతారనైనా ఆలోచించ కుండా, నేలపై దృష్టులునిగిడ్చి "నాకా దరిద్రపు గాజులక్కరలేదు. అందం లేవు చందం లేవు. పూర్వ కాలం ఫేషను. ఎప్పుడైనా బంగారం సరుకు కొంటేనా? చేస్తేనా? ఎన్నాళ్లనుంచో పాడుతున్నా నా— నెక్లెస్ కొనకుండా ఈపాడు గాజు లెందుకొన్నారూ? హరమ్మగారి నెక్లెస్ చూడండి ఎంత బాగుందో— పోనీ ఆ వొంద నా మొహాన్ని పారెయ్యలేక పోయారూ, నా ఇష్టంవచ్చింది కొనుక్కొందును.'' రవణ కడుపులోదంతా వెళ్లగక్కేసింది.

చిరంజీవి రావు రవణమాటలు వినగానే, ఏదో పెద్ద దెబ్బతిన్న వ్యక్తిలా బాధ పడ్డాడు. తనంటే భార్యకు ఇంత నిర్లక్ష్యభావం, తిరస్కారం కలగడానికి తనేం

తప్పు చేసాడో వూహించుకోలేక పోయాడు. "నీ కింత కష్టంగావుంటే వాటిని తిరిగి ఇచ్చేస్తానులే—బుద్ధి వచ్చింది. ఇకమీదట డబ్బు పారేస్తాను. నువ్వు మీ అమ్మ ఇష్టంవచ్చినట్లు తగలేసుకోండి. అసలు ఆ వోందా పెట్టి నాలుగు నూట్లు కుట్టించుకొంటే ఏంచేసేదానవు? నెక్లెస్ట—మన బ్రతుక్కి. హరమ్మగారు కొనుక్కుందిట. ఆవిడ A. C. T O. గారి పెళ్లాం. ఆవిడా నువ్వూ ఒకటేనా, వాళ్ల ఆయనకు జీతంగాక వోందలాది దొరుకుతుంది."

"నాడబ్బుంది గనుక అడిగాను..." రవణ ఏవేవో అనబోతోంటే—"వటప్. అసలు నీకు పుట్టిందేనా ఈ బుద్ధి. అమ్మగారు ఎక్కించిందా" చిరచిరలాడుతూ రవణ చేతిలోని గాజులు లాక్కొని బీరువాలో పెట్టి తాళం వేశాడు.

"ఏమే, నేను. చెప్పిపెట్టానుటే—బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడవేమి?" రంగమ్మత్త సావిటిలోకి వచ్చింది. నీళ్లు నములుతూ నుంచుంది రవణ.

"ఇంటిలో వుండేదిచాలక, దానికి లేనిపోనివన్నీ ఎక్కిస్తున్నావటమ్మా నీవు" అన్నాడు చిరంజీవిరావు సీరియస్‌గా

"మా అమ్మ నలాంటారేమిటీ? నోటికి వచ్చినట్లు మాట్లాడమేనా? ఆవిడకేమి, లేదా పోదా? మీ యింటిలోపడి తినడానికి, ఆవిడకు కోపం వచ్చిందంటే; నుంచున్నపాటిని రాత్రికి రాత్రే ప్రయాణం కడుతుంది" రవణ తల్లిని వెనకేసుకురావడం కోసం గొంతుక పెద్దది చేసింది.

"శీఘ్రంగా ఈరాత్రికి వెళ్లమను. పీడ వదుల్తుంది"


I.T.L

గ్రైప్ సిరప్




అమ్లపిత్తహరము, ఉదరవాయు హరము, నిరపాయకరము

ఆదంటే పాపాయిలకు బలేప్రీతి

ప్రతితల్లీ ఒకసీసా అందుబాటుగా ఉంచుకోవాలి

తయారుచేయువారు :
ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబొరేటరీ లిమిటెడ్,
మల్లేశ్వరం, బెంగుళూరు.

సేల్సుడిపో: నెం. 35/37, తంబుచెట్టివీధి, మదరాసు-1.

BZ 26 TG

చిరంజీవి రావు ముఖం కోపంతో ఎఱ్ఱబడింది. తను ఏ మాత్రం మాట్లాడినా చేయి చేసుకొంటాడనే భయం ఆమెను ఆవరించటంవల్ల రవణ మౌనం వహించింది.

రంగమ్మత్త "నేను మీ యింటిలోపడి తింటూన్నందుకు, మీ ఆయన అనవలసినవన్నీ అన్నాడు. నాకర్మం కాలింది. మీయింటిలో కూలిదానిలా వెట్టి చాకిరీ చేస్తూ, ఎంగిలి విస్తర్లు ఎత్తిపారేస్తూ అడ్డమయిన మాటలూ పడటానికి, తక్షణం పోతాను" కంట తడి బెట్టుతూ మూటాముల్లూ సర్దింది.

"అమ్మను వెళ్లద్దని చెప్పండీ" అని రవణ చిరంజీవి రావుని అడగలేదు. 'తక్షణం దయచేయి" చిరంజీవి రావు వీరావేశంతో డాబామీద కెళ్లిపోయాడు. రవణ ఏడుస్తూన్నా రంగమ్మత్త మొండిమనిషేమో, ఆ రాత్రి ప్యాసెంజెరుకే వెళ్లిపోయింది. ఆ రాత్రంతా భార్యాభర్తలు మాట్లాడుకోలేదు.

రంగమ్మత్త కోపగించి వెళ్లిపోయిన పదిరోజులకే, చిరంజీవి రావు; రవణ, యథాప్రకారంగా, ఏ విధమైన పొంపొచ్చాలూ లేకుండా కాలాన్ని గడుపుతూ వచ్చారు. ఓ రోజున రాత్రి వొంటింటిలో పని పూర్తి చేసుకొని రవణ పడకగదిలో ప్రవేశించి, "మిమ్మల్నో మాటాడగనా?" అంది మంచానికి చేరబడి. ఏమిటి చెంగుచిగురు వ్రేలుకు చుట్టుతూ. అడుగన్నట్లు ముఖంలోకి అర్థంకానట్లు చూచాడు చిరంజీవి రావు.

"గాజులు తిరిగి ఇచ్చేసారా? రేపు మన హేమ పుట్టినరోజు, రెండోఏడు వస్తుంది. అందర్నీ పేరంటానికి పిలుస్తాను—అప్పుడేదో చదువులేని పల్లెటూరిదాన్ని గనుక; ఏదో నెక్లెస్‌కొంటారని అమ్మమాట పట్టుకొని వొద్దన్నాను. అయినా నాకుమాత్రం తెలీదూ? కొన్న గాజులు మళ్లీ ఎవరు పుచ్చుకొంటారూ? నిన్న ముసలయ్య చెప్పాడు అమ్మేద్దా మనుకొన్నారటగా—అమ్మితే పిల్లలుగలవాళ్లం మళ్ళీ కొనగలరా? అందులో మనకు మరి ఆర్నెమాసాల్లో మరో...రవణ సిగ్గుతో తల క్రిందికి దించింది. చిరంజీవి రావు ఎందుచేతనో మాట్లాడలేక పోయాడు. అతనేదో మాటల్లో చెప్ప





ఒరిస్సా, నైజామ్ ఆంధ్ర
తమిళ జిల్లాలకు ఏజంట్లు:
శ్రీ సీతారామా
జనరల్ స్టోర్సు,
బరంపురం, సికింద్రాబాదు
బెజవాడ, మధుర.

డాని వీళ్లేని, ఆవేదన పడుతూన్నట్లు ఆమెకు అతని ముఖంలో మసగగా కనిపించింది. "ఏమైందీ...అవసరం వచ్చి అమ్మేసారా? పోనీలెండి" అంది రవణ అతన్ని సమీపించి.

"అమ్మేసాను రవణా—ఆఫీసు లెఖ్ఖల్లో తఖరా వచ్చింది ఎనభైరూపాయిలు. మనసు బాగుండనప్పుడు ఎప్పుడేమి తప్పుచేసానో—ఉద్యోగం పోతుందనే భయంతో, నిన్ననే గాజులు అమ్మి ఎనభైరూపాయిలూ వేసాను—మన నెత్తిమీద శనిదేవత నగ్న నాట్యం చేస్తోంది" చిరంజీవి రావు కళ్లు అనుకోకుండా చెమ్మగిలాయి. "వెధవగాజులు వచ్చినవేళ మంచిది కాదు. అమ్మితే అమ్మేశారు. శని విరగడయింది; ఆ మాత్రం దానికే ఆడవాళ్లలా బాధపడతారా?" రవణ భర్తని గట్టిగా హృదయానికి హత్తుకొంది.

"నేనెందుకు బాధ పడతాను. మన కింకో పాప పుడతాడుగా" అంటూ చిరంజీవి రావు ఆమె లేతబుగ్గ మీద చిన్న వలపుచిటికి వేసాడు. రవణ కిలకిల నవ్వగానే ఆమె గాజులు మ్రోగాయి. ఆమె నవ్వుతూంటే, ఆమె కళ్లల్లో ప్రతిఫలిస్తున్న జ్యోతిస్సులను చూడగలిగాడతను.

---

"కథాంజలి" లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితం. ఎవరిని ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రం బాధ్యులు కాము.

—ఎడిటర్.

---

